పాటల బండి

పాట పరవళ్ళు తొక్కుతోంది.

సొద్దనాట్ల పచ్చదనం పైన పక్షిలా గిరికీలు కొడుతోంది.

గెనిమ మీద వరసగా కూచుని ఉన్న కూలీల నడుమ ఓ గొంతులోంచి అలవోకగా బైటపడి పరిసరాల్ని పరవశింపజేస్తోంది.

అటుఇటు మరో రెండు గొంతులు వంతపలుకుతున్నాయి.

వాళ్ళకు ఎదురుగా సగం మునంలోనే ఆగిపోయివుంది నాటు.

కూలీలు మునంలోంచి గట్టెక్కినా పాట మాత్రం ఆగలేదు.

విద్యుత్ సరఫరా నిలిచి దాదాపు అరగంట కావొస్తోంది.

మోటారుపంపు మూగవోవటంతో కయ్యల్లో నీళ్లు పూర్తిగా ఇంకిపోయాయి. కాలువ కూడా బురదగట్టి వుంది.

పారే నీళ్ళ వెంబడి నాటు 'సాగుతూ వుండాలి.

నీళ్ళు పారకం లేక నాటు ఆగింది.

కూలీలు ఖాళీగా కూచుని వున్నారు గాని వాళ్ళ నోరు మాత్రం పనిచేస్తూనే ఉంది.

మోటారు వద్దనించి వాళ్ళ కడకు వస్తోన్న జయమ్మ అసహనంతో రగిలిపోతూ వుంది.

మోటారుకూ నాటుకూ మధ్య చాలా సేపట్నించి ఆసుపోసినట్లు తిరుగుతూనే వుంది ఆమె.

కూలీలతోటి కుదురుగా కూచోలేకపోతోంది.

గొంతు కలపలేకపోతోంది. పాటల మాధుర్యాన్ని సైతం ఆస్వాదించలేకపోతోంది.

తేపతేపకు మోటారుకేసి చూస్తోంది.

మోటారు పక్కన బల్బును నిశితంగా పరిశీలిస్తోంది. గుంతకాడ నక్కలా అక్కడే కాచుక్కూచుని ఉన్న మొగున్ని చూపుల్తో తడువుతోంది.

కరంటుమీది తన అసహనాన్ని అప్పుడప్పుడూ తిట్లల్లోకి మారుస్తోంది.

సబ్‌స్టేషన్‌లోని ఉద్యోగుల్ని దుమ్మెత్తి పోస్తోంది.

వదిలేది ఒక్కపూట కరంటే అయినా యిట్లా ఇబ్బందులు పెడుతూ కూడా ఏటికేటికి చార్జీల్ని ఇబ్బడిముబ్బడిగా పెంచే ప్రభుత్వాన్ని శపిస్తోంది.

సందకాడో, సగం బొద్దన్నో కరంటు ఉన్నప్పుడు చేనంతా మూరెడులోతున నీళ్ళు నిలిపి తర్వాత నాటుకోవడానికి యిది వరినాటుగాదు. అచ్చుగట్టె కయ్యల్ని నీళ్ళు తడుపుతూ

పోతూంటే వెనకే నాట్లు పడుతుండాలి. రవ్వంత ఆలస్యమైనా నీరింకి కాళ్ళకు లాడాలు లాడాలుగా బురద అంటుకొస్తుంది.

పొద్దు పడమటికి వాలి వుంది.

ఆకాశంలో అక్కడొకటి, యిక్కడొకటి మేఘాలు నిశ్చలంగా ఉన్నాయి. నిన్నా మొన్నయితే గూళ్ళు గూళ్ళుగా లేచి ఏవేవో ఆశలు రేపాయి.

సంక్రాంతి ముందు యీ ఉత్తుత్తి మేఘాల ఆర్భాటం మామూలే.

గట్టుమీది కూలీల నోళ్ళల్లోంచి పాటలు ఆగలేదు.

నాటు ఆగిపోయిందనే బాధ వాళ్ళ ఎవరి మొహాల్లోనూ కన్పించలేదు జయమ్మకు.

'ఊరక కూకున్నే కూలొస్తదది. వాళ్ళకేం నొప్పి? పైటేల తిన్నె సంగటి అరక్క పాటమీద బన్నెరు' అనుకొంది.

'కూలోల్లకంటే సరే! మొగునికన్నా వుండాలగదా బాధ'

మోటారు దగ్గర గొంతుక్కూచుని ఉన్న మొగున్ని చూస్తోంటే రవరవ మండుతోంది ఆమెకు.

కరంటు రాలేదనే ఆరాటంగానీ, ఆవేదనగానీ అతని మొహంలో రవ్వంతయినా కన్పించలేదు.

పైపెచ్చు కూలీల పాటకు గొంతు కలుపుతున్నాడు.

"మా మొగాల్లో ఏముంది? అట్టమల్లి బల్బుదిక్కు సూస్చాందు" ఎక్కస పట్టలేక కేకేసింది మొగునికేసి.

ఒక్కక్షణం కొతుకుబడి తిరిగి కొనసాగింది పాట.

కరంటు రాదని తీర్మానించుకొన్న రైతులు కొందరు నిరాశగా ఇంటిదారి బట్టారు.

అక్కడక్కడా నాటు ఉన్న చేలల్లో మాత్రం చెట్లకింద, గెట్లమీదా తిష్ఠవేసి ఉన్నారు కూలీలు.

తమ పరిస్థితి చాలా దయనీయంగా అన్పించింది జయమ్మకు.

అంతులేని ఆవేదనగా ఉంది.

అసహనంతో తలపట్టుకొంటోంది.

తేపతేపకూ కరంటు కట్‌గావటం, నాటు కుంటుబడటం, ఆశకొద్దీ పెరికి పెట్టుకున్న నారు రేపటికి తలలు వేలాడేయటం, చేను కొంత బీడుబడటం, పండింది నాటుకు కోతకూళ్ళకు కూడా చాలకపోవడం-దృశ్యాలు దృశ్యాలుగా కళ్ళముందు కదలాడుతున్నాయి.

కరంటు ఓ సమస్య అయితే పాట మరో సమస్య అయికూచుంది ఆమెకు.

పాటకంటే కూడా సందర్భోచితం కాని వాళ్ళ పకపకల యికయికల సంతోషం ఆమెను నిలువెల్లా కాలుస్తూ ఉంది.

బల్బు వెలిగినట్లుగా అనిపించి ఉలిక్కిపడి నిశితంగా చూసింది.

ఎండ తీక్షణతకు తళతళమంటోందో, బల్బులోకి కరంటే వచ్చిందో పోల్చుకోలేని పరిస్థితి.

ఇంటాయన మాత్రం స్టార్టర్ వద్దే గొంతుక్కూచుని లల్లాయి పదాలమీదున్నాడు.

ఆదుర్దా ఎక్కువైంది ఆమెకు.

అటు ఇటు మోటార్లకేసి నిక్కి నిక్కి చూసింది.

అక్కడి మనుషుల కదలికల్లోని హుషారుదనం గమనించగానే, పరిస్థితి అర్థమై తటాలున మొగునికేసి తలతిప్పబోతూనే కేకేసింది.

అతను కదలి స్టార్టర్ స్విచ్ నొక్కేసరికి కూలీల్ని కదలించింది.

కరంటు ఆగమనాన్ని గురించి అక్కడ పాట మొదలైంది.

గుడ్డలు విదిల్చుకొంటూ, ఒళ్ళు కదల్చుకొంటూ మునాల్లోకి దిగేసరికి నీళ్ళు కూడా కయ్యల్లోకి సాగాయి.

"వంగండి.... వంగండి.... " వాళ్ళమీద అసహనపడింది.

చుట్టుపట్ల మోటార్లన్నీ యింకా స్టార్ట్ చేయకపోవటం వల్ల కరంటు దండిగా అంది పంపులోంచి నీళ్ళు ఉరవడిగా దూకుతున్నాయి.

కయ్యపారేసరికి నాటు వెనకబడింది.

కూలీల్ని తొందరచేయటం మొదలెట్టింది జయమ్మ.

నీళ్ళతోటి హుషారుగా చేతులు కదల్చలేని వాళ్ళ పనిపట్ల అసహనపడుతోంది. వాళ్ళ పాట మీద మండిపడుతోంది.

ఈ లోపు వూర్లోంచి వచ్చిన రైతులు ఎవరి మోటార్లను వాళ్ళు స్టార్ట్ జేసేసరికి ట్రాన్స్‌ఫార్మర్‌లో ఓల్టేజి బాగా తగ్గింది. మోటారు వేగం మందగించింది. కాలువలో నీళ్ళు కూడా పలుచబడ్డాయి.

కయ్యకు ఇద్దరి వంతున పదిమంది కూలీలు పెంటినారు నాటుతున్నారు.

రెండురకాల నారూ కలవకుండా జాగ్రత్తలు తీసికొంటూ కూలీల్ని అజమాయిషీ చేస్తోంది జయమ్మ.

మడవకు బొక్కలుపడి పారిన కయ్యే మళ్ళీ తడుస్తోంటే ఆదరాబాదరా వెళ్ళి మట్టి అడ్డమేసి మొగునికేసి చూసింది.

మడవ కట్టేందుక్కూడా వొల్లొంగని అతని సోమరితనం కేసి అసహనంగా చూసింది.

పారపట్టుకొని నిల్చున్నాడుగాని పనిమీద మనస్సు పెట్టలేదు.

అతని నిర్లక్ష్యం మీద కోపం ముంచుకొచ్చింది.

పొలం పనుల్లో వేలు పెట్టనీకుండా చదివించి ఎందుకూ పనికిరానివానిగా చేసిన అత్తమామల మీద కోపమొచ్చింది.

బియ్యాడి చేశాడు కాబట్టి ఖచ్చితంగా ఉపాధ్యాయుడవుతాడనే ఆశతో తన్నతనికిచ్చి పెళ్ళి చేసిన తల్లిదండ్రులమీద కోపం రేగింది.

భూములన్నిట్నీ కోరుకో గుత్తకో ఇద్దామంటాడు. ఉద్యోగమొచ్చేంతవరకూ కూచుని తిందామంటాడు లేదా వ్యాపారం పెట్టుకొందామంటాడు.

స్వంతంగా సేద్యం చేద్దామంటే సీమకరువు గురించి, పైరు చీడపీడల గురించీ మాట్లాడ్తాడు.

తనుకూడా కాడెద్దులు పెట్టి సేద్యం చేసేందుకు వ్యతిరేకమే. కూళ్ళు పెట్టి చేయించుకోవాలనే

మడవకు కూడా అతన్ని పిల్చేదికాదు.

'గంటసేపు కూడా రాని యీ కరంటు కోసం యాభైరూపాయల కూలి ఎందుకు వృథా చేయాలా? అనే.

తన పుట్టింట కూడా ఎద్దుల సేద్యం ఎప్పుడో ఎత్తేశారు.

తన అన్నలయితే ఇస్త్రీ మడతలు నలగకుండా గట్టుమీద కూచుని పైర్లు పెట్టుకొంటున్నారు. సుఖంగానే బతుకుతున్నారు.

తనకా మెలకువలు తెలుసు. సమర్ధవంతంగా అజమాయిషీ చేసి కూలీలచేత ఎట్లా పన్జేయించుకోవాలో తనకు బాగా అనుభవమే.

ఆలోచనల్లోంచి తేరుకొని చివరిమునంలో గట్టు వెంబడి పోతున్నారు. నాటటం మరచిన రిబకమ్మను కేకేసింది.

నాటు మంచి ఊపుమీదుంది.

నాటులాగే పాట పరిసరాలన్నిట్నీ పచ్చగా మారుస్తోంది.

పాటలాగే నాటు నేలను పరవశింపజేస్తోంది.

పలుచన అయిన మునాన్ని హెచ్చరిస్తోంది జయమ్మ.

అలవాటులో పొరపాటుగా వరినాటుకులా కైపు పెట్టి నాటిన వాళ్ళ తప్పును ఎత్తి చూపుతోంది.

తన సూచనల్ని పాటలోకలిపి నిర్లక్ష్యంగా కదిలే కూలీలపైన మండిపడుతోంది.

"వక్కాకు లేదాయే నోటికీ...

బో...బిక్కట్టాయనమ్మ నేటికీ...

వక్కాకు లేదాయే నోటికీ...."

దీవనమ్మ గొంతు విప్పింది.

జయమ్మకు భుజాలు తడుపుకొన్నట్లయింది.

అప్పటికే చాలాసార్లు వక్కాకు అడిగారు వాళ్ళు.

వాళ్లని కూలికి పిల్చినపుడే తాను వక్కాకు మూటగట్టుకు రావాల్సింది మర్చిపోయింది. మధ్యలో ఇంటికెళ్ళేందుకు తీరిక దొరకలేదు.

ఊర్లో వాళ్ళయితే ఇంతగా దేబిరించే వాళ్ళు కాదు. పైట చెరగు ముడిలోనో, బొడ్లోని అడపంలోనో ఎవరి వక్కాకు వాళ్ళు తెచ్చుకొనేవాళ్ళు.

ఇండ్లల్లో వాళ్ళే – తిండికీ వక్కాకుకూ యింతగా కొట్టకులాడిపోతుంటారు.

పాట హుషారుగా సాగుతోంది.

అప్పుడప్పుడూ జయమ్మకేసి ఓరగంట చూస్తున్నారు కొంతమంది కూలీలు.

వాళ్ళ చూపులు ఆమె ఒంటిమీద తేల్లు, జర్లయి పాకుతున్నాయి.

రెండు చరణాలు పూర్తయ్యాయి.

చివరి చరణానికి వచ్చేసరికి జయమ్మకు అసహనం పెరిగింది.

"తమలపాకిమ్మంటే తొలిశాకు యిస్తారు.

వక్క పేడిమ్మంటే గొర్రె పెంటికిస్తారు.

సున్నమడిగితే గోడజూపి నవ్వేస్తారు.

పొగకాడ మొగమైన సూసినోల్లే లేరు.

ఎంత మొర్రటైందమ్మ యీ పాడు కొంపా!

ఎట్ట బతికేనమ్మ వక్కాకు లేకా!"

పాట పరాకాష్ఠకు చేరింది.

ఆకుపాదంకంటే ముందు 'వక్కపాదం' రావాలనీ, పాటలో అన్వయం తప్పిందనీ విశ్రాంతమ్మ తకరారు పెట్టింది.

జీవనమ్మ వొప్పుకోలేదు.

"వక్కాకే తేనెప్పుడు ఏమాట ముందుంటే ఏ ముందిలే తల్లే!" రిబకమ్మ నిట్టూరుస్తూ సర్దిచెప్పింది.

వాళ్ళ పాట, మాట వింటోంటే – చిగురింత వెన్నుల్ని ఒంటికి కరిపించి లాగినంత అసహ్యపు జలదరింపు కలుగుతోంది జయమ్మకు.

తన్ను దృష్టిలో పెట్టుకొనే పాడారు సందేహంలేదు.

తనను అపహాస్యం చేస్తున్నారు.

వాళ్ళ తెలివి మీరిన తనానికి ఒళ్ళు మండిపోతూ ఉంది.

మునంలో వెనకబడిన కమలమ్మ మీద తన అక్కసంతా వెళ్ళగక్కింది.

నాటుకొంచెం పలుచన జేసిన మేరి పైకి 'గయ్' మని లేచింది.

వాళ్ళ మాటలు, పాటలు, యికయికలు, పకపకలు, చిన్న చిన్న గొడవల్తోనే పొద్దుబోతోందనీ, పని జరగటంలేదనీ గొణగసాగింది.

నాటుకంటే వాళ్ళకు పాటలే ముఖ్య మయ్యాయని కసురుకొంది.

పాటవల్ల చేతులు సరిగ్గా ఆడించడం లేదనీ, మునాలు వెనకబడుతున్నాయనీ, నాటు సరిగ్గా అతకడంలేదనీ, యిట్లయితే పండిన పంటంతా నాటుకూళ్ళకే సరిపోతుందనీ సన్నగా రాగాలు నూరసాగింది.

ఈ దెబ్బతోపాట కొంత కొతుకుబడింది.

మడవగడుతూఉన్న మగాడు కాస్తా తలెత్తి భార్యకేసి వింతగా చూశాడు.

కొత్తదాన్నిలా చూశాడు.

ఎందుకట్లా ఆమె ఆరాటపడుతోందో అతనికి అర్థంకాలేదు.

నాటు అయిపోదేమోనని తనుపడే ఆందోళనని కూలీలు గ్రహించలేదని కాబోలు– వాళ్ళమీద కసి పెంచుకున్నట్లుంది.

తన బాధలో కొంతయినా వాళ్ళు పాలుపంచుకొని అనుభవించనందుకు అసహనపడుతోన్నట్లుంది.

ఆమె అట్లా వూహించటమే పొరబాటు.

తన పుట్టినింటి వాళ్ళకులాగా యిది కాలువ నీటి వ్యవసాయం కాదుగదా!

వర్షాన్ని, బోరుబావుల్ని నమ్ముకున్న సేద్యానికి అంతులేని ఓపిక ఉండాలి. చేలోకి దిగి మట్టి పూసుకొని చేసేవాళ్ళకు మాత్రమే ఆ ఓపిక వస్తుంది.

తమట్లా చేయలేమనే గదా కోరుకో గుత్తకో యిద్దామన్నది.

వర్షమూ, కరంటూ రెండూ సమయానికీ రాకపోవటం యిక్కడ అతిసహజం. దాన్ని అర్థం చేసికోనోల్లు వ్యవసాయం ఎట్లా చేస్తారు.

అతని ఆలోచనలు పూర్తికాకముందే కరంటు బల్బు ఆరిపోయింది.

జయమ్మ ఆందోళన మరికాస్త ఎక్కువయింది.

చేతిలో నారు కయ్యల్లో కుదురుగా నిలిపి గట్టెక్కారు కూలీలు.

గట్టుమీద కూచుంటూ మళ్ళీ పాటలు మొదలెట్టారు. జయమ్మ ఆవేదన గురించి అసలు పట్టించుకోలేదు.

ఓవర్‌లోడువల్ల ట్రాన్స్‌ఫార్మర్‌లో ఫీజులు కాలిపోయాయి. చుట్టుపట్ల మగాళ్ళతో బాటు తన మగడూ వెళ్ళాడు ఫీజులు తగిలించేందుకు.

బల్బు వెలగగానే స్టార్టర్ వద్ద మనిషి లేకపోవటం గుర్తొచ్చి కిందామీదా పడుతూ పరుగెత్తింది జయమ్మ. స్విచ్ నొక్కినొక్కి మోటారు రన్‌జేసి వచ్చింది.

ట్రాన్స్‌ఫార్మర్ వద్దకెళ్ళిన మొగుని తెలివితక్కువతనం పట్ల మండిపడింది.

ఎవరోకరు ఫీజులు తగిలిస్తారుగదా! కనిపెట్టుకొని వుండి స్విచ్ నొక్కితే ఒక్కకయ్య అయినా జమాయించి పారుతుందిగదా!

మొగుని చేతకాని తనానికి తోడు కూలీల నిర్లక్ష్యం ఆమెకు భరించరానిదిగా వుంది.

తను టెన్షన్ అనుభవిస్తోంటే, వాళ్ళు ఆనందంగా పాటలు పాడుకొంటూ గడపటం చింతకాయ కొరికినట్లుగా ఉంది.

ఊరిబైటి యిండ్లల్లో వాళ్ళను కూలికి పిల్చటమే తప్పనుకొంది.

వాళ్ళకు కడుపుకింత తిండి, పంటికింద వక్కపలుకు వుంటే చాలు - దేశంలోని పాటలన్నీ నాలుకమీదే.

మడవ వద్దకొచ్చిన మొగునిమీద గయ్‌మని లేచింది.

పాటపాడే కూలీల గొంతుకలమీద ఊరకే నూరసాగింది.

పాటవల్ల వాళ్ళు పొందే ఆనందం ఆమెకు అరగకుండా వుంది.

తన అహాన్ని గాయం చేసేవాళ్ళ గేయం ఆమెకు కంటగింపయ్యింది.

సణుగుడు ఎక్కువైంది.

పాటసైతం మధ్య మధ్య తునకలయ్యేలా గొణుగుడు స్థాయిని పెంచింది.

ఆమె నిరసనతో తమకు సంబంధం లేనట్లుగా చాలాసేపు నిర్లక్ష్యంగా ప్రవర్తించారు వాళ్ళు.

చివరకు విషయం పూర్తిగా అర్థమై ఆమెకేసి వింతగా చూశారు. కొత్తగా చూశారు. బాధగా చూశారు....కసిగా చూసారు.

మరికొంతసేపటికి పాడుతున్నవాళ్ళ గొంతులు కాస్తా మూగవోయాయి.

నాటుమాత్రం సాగుతూ ఉంది.

వాళ్ళమీద తనేదో విజయం సాధించినట్లుగా అనుభూతి కలిగింది జయమ్మకు.

పాటలేని నాటు ఆమెకొ్కంత గర్వాన్ని కూడా కలిగించింది.

చేని నిండా పరచుకొన్న నిశ్శబ్దం తన తలకెత్తిన కిరీటంలా భావనకొచ్చింది.

'ఇండ్లలో వాళ్ళ నోళ్ళు మూయించింది బహుశా తనొక్కతేనేమో!'

ఆమె భావ ప్రకంపనలతో సంబంధం లేకుండా మరోసారి కరంటుపోవటం, రావటం జరిగింది.

పాటలేని నాటు నడుస్తూనే ఉంది.

మడవగట్టే మొగోడికి మాత్రం యిది కొంత అసహజంగా తోచింది.

నాటులో ఏదో లయ తప్పినట్లుగా అనిపించింది.

మరేదో యిష్టంలేనితనం.

నాటు మునుపటిలా సక్రమంగా పడటంలేదు.

ఒక్కోచోట మెండుగా, మరోచోట పలుచగా...ఎగుడుదిగుడులుగా వుంది.

అక్కడక్కడ పోతునారు మర్చిపోవటం కూడా జరుగుతోంది.

జయమ్మ 'గయ్' మంది.

వాళ్ళ పరధ్యానం మీద మండిపడింది.

వాళ్ళ తప్పుల్ని పట్టించుకోని మొగుని మీద విరుచుకుపడింది.

జయమ్మ ఎంతగా తప్పుల్ని వెదకి చూపినా అవే పొరబాట్లని పునరావృతం చేస్తున్నారు వాళ్ళు.

ఆమె కేకలేసింది. ... తిట్టింది.

వాళ్ళు సమాధానం ఇవ్వలేదు.

పొరబాట్లని వదల్లేదు.

జయమ్మ నోరు మరింత పెరిగింది.

తట్టుకోలేకపోయింది కమలమ్మ. "మేమేమో బాగానే నాట్లేస్చాండం. మా నాటులో వారా రాలేదు నీ సూపుల్లోనే వొచ్చింది" చెప్పింది కరుగ్గా.

"మా సేతయ్యేది యింతే తల్లి!" దీవనమ్మ చెప్పింది.

అదంతా తన్ను లెక్కజేయని తనంగానే నిర్ణయించుకొంది జయమ్మ. వాళ్ళచేత ఎట్లా పన్జేయించుకోవాలో తెలిసిరాలేదు.

చాలాసేపు గొణుగుళ్ళతోనే గడిపింది.

తర్వాత తనూ నోరుమూసికొంది.

ఎండాకాలపు మధ్యాహ్నాల్ని గుర్తుజేస్తూ వుంది అక్కడి నిశ్శబ్ద వాతావరణం. ఆ మౌనాన్ని భరించలేకపోతున్నాడు మదవమనిషి.

ఏదో పోగొట్టుకొన్నట్లుగా ఉంది అతనికి. కూలీలమీద తన భార్యపెత్తనం చూపే పద్ధతి నచ్చలేదు.

తనేమీ చెప్పలేని నిస్సహాయస్థితి.

వాళ్ళకు మూగతనం అంటించి ఆమె పొందే తృప్తి అర్థమైంది. కరంటు మీది కసి రూపు మార్చుకుంది.

'ఒక్క గంట కరెంటు కోసం స్టార్టర్ వద్ద సాయంత్రం దాకా అయినాగొంతుక్కూచుని నిరీక్షించే ఓపిక ఉన్నపుడే వ్యవసాయం జోలికి రావాలి' నిస్తేజంగా చూస్తూండిపోయాడు.

అంతలో అటుగా వచ్చింది పక్కచేలో గడ్డి పెరుక్కొంటూ ఉన్న వెంకటమ్మ.

"యాందెంద్రా! పాటల్లేకుండా నాద్తాంద్రు... పైరు మూగబోతదంద్రా!" అంది.

"పాట పాడంద్రే!" అంటూ కూలీల్ని ఎగదోసింది.

"యీయమ్మకు మూగిపిల్లోల్లంటేనే యిట్టమంటలే..." మేరెమ్మ చెప్పింది.

చివుక్కున తలెత్తి చూసింది జయమ్మ.

"నలుగుబెట్టినప్పుడు పదమన్నా పాడించుకొన్నెవా లేదా పిల్లా? కడుపుతోవుండావు జాగర్త" వెంకటమ్మ ఎకసెక్కంగా అంది.

"సాల్లే నీ సంబడం" గొణుక్కొంది జయమ్మ. అప్రయత్నంగానే చేత్తో కడుపు తడువుకొంది.

ఎన్ని క్షేత్రాలు తిరిగిందనీ! ఎన్ని తీర్థాల్లో మునిగిందనీ! ఎన్నేళ్ళపాటు ఏడ్చిందనీ! - యీ కడుపుకోసం.

వెంకటమ్మ వెళ్ళిపోయింది. గాని పాట మొదలవలేదు.

నాటు సక్రమంగా పడటంలేదు.

వాళ్ళ శరీరమంతా ఏదో మదపుతనం ఆవరించుకొన్నట్లుగా అనిపించింది జయమ్మకు.

తను గొణిగినా, తిట్టినా లెక్కజేసేట్టు లేరు.వాళ్ళ నాటులో ఏదో సహజత్వం కనుమరుగయ్యింది.

మరేదో లయ లోపించింది.

చేత చిన్న చక్రాన్ని దొర్లించుకుంటూ అలసట తెలీకుండా పరువెత్తే పసిపిల్లాడిలా సాగాల్సింది నాటు. ఊతకర్రలేని ముసలి నడకలా ఉంది.

తలపట్టుక్కూచుండి పోయిందామె.

కొంతసేపటికి ఎక్కడిదో సన్నని రాగం విన్పించి అటుకేసి చూసింది.

సన్నసన్నగా కూనిరాగం తీస్తున్నాడు తన మగడు.

కూలీలకు సైగజేస్తున్నాడు గొంతు కలపమని.

"కపిలదోలే చిన్నవాడా! కాపోల్ల కుర్రవాడా!
గాపతాడు వదలిపెట్టబ్బీ! నాగుండెకేసిన
చూపుగాలం వూడబెరుకబ్బీ!"

పార మడవలో వదలి లయగా చిటుకేస్తూ పాడుతున్నాడు.

అతనికేసి ఆశ్చర్యంగా చూశారు కూలీలంతా.

వాళ్ళ చేతుల్లోని నారు సైతం తలనిక్కబెట్టింది వింతగా.

అతను రెండు చరణాలు కూడా పూర్తిజేయకముందే ఆగలేక గొంతు కలిపింది విశ్రాంతి.

"బారిగుంతకు తీరికుండదు. మొరపు చేనికి దప్పికారదు.
గాదెనిండే కాలమెపుడబ్బీ? నావలపుపంట ఓదెలేసే మూర్తమెపుడబ్బీ?"

నీళ్ళ తడిసోకి పచ్చనవుతోన్న వాడినపైరులా కూలీల్లో క్రమంగా హుషారు వచ్చింది.

పాట పూర్తయ్యేసరికి అందరూ సర్దుబాటయ్యారు.

పాటవెంట మరోపాట ఉరకలేసింది.

చేతివాటం కూడా మెరుగయ్యింది.

నాటు క్రమబద్ధంగా పడుతున్నట్లే తోచింది జయమ్మకు.

పాటలు పాడుతుంటేనే వాళ్ళు సక్రమంగా పనిచేస్తారనే విషయం ఆమెక్కూడా అర్థమైంది.

తనపైన వాళ్ళు విజయం సాధించారు.

తమ పట్టు నిలబెట్టుకున్నారు.

వాళ్ళ ఆనందానికి, దాన్ని వ్యక్తంచేసే గొంతుక్కీ అడ్డపడేశక్తిని తననుండి లాగేశారు. ఏది ఏమయితేనేం? – సక్రమంగా పనిజరుగుతూ ఉంది.

అది చాలనుకొంది ఆమె.

మొగునికేసి చూసింది.

అతని మొహంలో ఏదో ఆనందం.

నిజంగానే అతనికి చాలా సంతోషంగా వుంది.

ఆమెలో కనిపిస్తోన్న మార్పు ఉల్లాసాన్ని కలిగిస్తూ వుంది.

ఇప్పుడు నాటుకూడా పాటలా సాగుతూ ఉంది. పచ్చపచ్చగా వయ్యారాలు పోతూ వుంది.

యజమానురాలు తమను ఎంతటి మానసిక వ్యధకు గురిజేసినా, అంతా మర్చిపోయి పాటలై కరుగుతూ ఉన్న కూలీల్ని చూసి అబ్బురపడ్డాడు అతను.

వాళ్ళ ప్రకృతే అంత.

బాధల్లోనూ పాడుతుంటారు.

సంతోషంలోనూ పాడుతుంటారు.

ఆకలిని సైతం పాటల్లోనో, తమాషా మాటల్లోనో మరచిపోయి బతుకుతూ ఉంటారు. వాళ్ళు వొళ్ళంతా పాటలే.

ఎక్కడ తాకినా పాటే విన్పిస్తుంది.

"ఇన్ని పాటలు మీకెట్లా వొచ్చు? యాడ నేర్చుకొన్నెరు?" అడిగాడు - వాళ్ళకేసి ఆశ్చర్యంగా చూస్తూ. ఈ ప్రశ్న తనలో చాలా రోజులుగా నలుగుతూ వుంది.

తమ ఆడాళ్ళకు అందని ఇంత పదాలసంపద వీళ్ళకెట్లా అబ్బిందో? ఎక్కడివో యీ పాటలన్నీ?...ఎవరివో...?

మునంలోంచి నిటారుగా నిల్చుంది దీవనమ్మ.

"యీ పాటలన్నీ మీవే..." చెప్పింది.

ఆమె చేతిలోని సొద్దనారు వయ్యారాలు పోతూ వుంది.

నొసలు ముడేసి చూశాడు ఆమెకేసి.

"పాటలన్నీ బండినిండా పోసుకొని మీరు తోలకపోతావుంటే - బండి మా యిండ్ల ముందు వాటుబడింది. మేం పరుగెత్తుకొంటా వచ్చి అందినకాడికి పాటలేరుకొని కొంగులో పోసకపొయ్యినం..." నవ్వుతూ చెప్పి మరో పాటను అందుకొంది.

జయమ్మ కూడా వింతగా చూసింది వాళ్ళకేసి. పాటల్ని బండిలో పోసుకపోవటం, బండి వాటుబడటం, వాళ్ళొచ్చి పాటల్ని ఏరుకోవటం... అంతా అయోమయంగా తోచింది.

అతనిక్కూడా యీ పిట్టకథ అంత సులభంగా అర్థంకాలేదు.

వ్యవసాయిక జీవితపు మూలాల్లోకి తొలుచుకొంటూ పోతేగాని తెలిసిరాలేదు.

రాత్రి భోంచేసిన తర్వాత ఆలుమగలిద్దరూ సుదీర్ఘమైన చర్చకు దిగితేగాని పాటలబండి సంగతి ఓ కొలిక్కిరాలేదు.

నిజమే.

తమ పాటల్ని వీళ్ళు దోచుకున్నారు.

పాటలబండిని వాటుబడేలా చేసి మరీ తస్కరించారు.

మట్టిలో పొర్లాడే రైతుదనం నుంచి గట్టుమీద కూచుని అజమాయిషి చేసే రెడ్డిరికపు దశకేసి పయనించే తాము తమకక్కరలేని శ్రమ సౌందర్యపు పాటల్ని బండికెత్తి దూరంగా తోలుతూ వుంటే వాళ్ళు కాజేశారు.

పనీపాటా ఒకే ఆత్మస్వరూపంగా భావించే అద్వైతానంద స్థితికి వాళ్ళు చేరుకొంటూ వుంటే - పాటను వేరుచేసినపుడే స్వచ్ఛమైన పని అవతరిస్తుందన్న మేధావితనానికి తామిప్పుడు దగ్గరవుతున్నారు. వాస్తవంగానే తాము పాటలబండిని వాటేసుకొన్నారు.

వాళ్ళొచ్చి పాటల్ని కొంగులో పోసుకుపోతోంటే వాళ్ళని అమాయకుల్నిలా చూశారు. ఇప్పుడర్థమవుతో వుంది - ఎవరు అమాయికులో? ఎవరు పిచ్చివారో?

◆ వార్త సండే - ***21.10.2001*** ◆